క్లుప్తంగా

థర్డ్ జెండర్స్‌కు సత్వర న్యాయం



మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో గురువారం పీఎల్‌వీలు, ప్యానెల్ లాయర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. సమాజంలో థర్డ్ జెండర్‌కు న్యాయ స్థానాలు ప్రత్యేక గుర్తింపునిచ్చాయని, వారికి సత్వర న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీఎల్‌వీలు, ప్యానెల్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, వన్‌స్టాప్ సెంటర్, కో–ఆర్డినేటర్ గౌతం పాల్గొన్నారు.

పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పీపీగా ప్రకాష్‌రెడ్డి

కర్నూలు (లీగల్): పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నాలుగో అదనపు జిల్లా కోర్టు పీపీ వై.ప్రకాష్ రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు పనిచేసిన వి.వెంకటేశ్వరరెడ్డి పదవీ కాలం ముగియడంతో ప్రకాష్‌రెడ్డిని నియమించారు.

డిజిటల్ ఓపీ కౌంటర్ల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని డిజిటల్ ఓపీ కౌంటర్లను గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ–హాస్పిటల్ స్కాన్ అండ్ షేర్, అభా ఐడీ, ఓపీ రిజిస్ట్రేషన్ల గురించి ఆరా తీశారు. ఈ డిజిటల్ ఓపీ సేవలను మరింతగా మెరుగుపరిచేందుకు పలు సూచనలు చేశారు. కౌంటర్లలో త్వరగా ఓపీ ఇచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఈ డిజిటల్ ఓపీ కోసం ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వారి మొబైల్ నంబర్ వెంట తీసుకుని రావాలని సూచించారు. ఈ–హాస్పిటల్ నోడల్ అధికారి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డీపీఎంఓ డాక్టర్ ఉమ చెప్పారు. ఆమె గురువారం స్థానిక శ్రీరామనగర్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణేష్‌నగర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 3.0 సర్వే అసంక్రమణ వ్యాధుల నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన వారందరికీ మధుమేహం, రక్తపోటు, నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీపీఓ విజయరాజు, వైద్యాధికారి డాక్టర్ దివ్య, మహిళా ఆరోగ్య కార్యకర్త సుజాత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనుల పరిశీలన

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని పంచలింగాల గ్రామ సమీపంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను గురువారం ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సంవత్సరంలోగా పూర్తి చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల ఉద్యోగాలు జిల్లా వాసులకు అందుతాయని ఆయన తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు

కర్నూలు (టౌన్): కర్నూలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు పలు చోట్ల దాడులు చేశారు. బెల్టు షాపుల పేరుతో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఓర్వకల్లు మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన హేమలత అనే మహిళ వద్ద 42 మద్యం బాటిళ్లు, కర్నూలు పట్టణంలోని కల్పనా దాబా వద్ద షేక్ సుభాన్ అనే వ్యక్తి వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు వెల్లడించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు రెహనా బేగం, చంద్రహాస్, సిబ్బంది పాల్గొన్నారు.

17న రెవెన్యూ ఉద్యోగుల కార్తీక వన భోజనం

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ ఉద్యోగుల కార్తీక వనభోజన మహోత్సవాన్ని అలంపూరల్‌లోని జోగులాంబ శక్తిపీఠంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున కలెక్టరేట్ నుంచి జోగులాంబకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేస్తామని, ఆసక్తి ఉన్న రెవెన్యూ ఉద్యోగుల కుటుంబాల వివరాలను ఈనెల 15వ తేదీలోపు కర్నూలు డివిజన్‌కు సంబంధించి డీటీ కె.రఘునాథ్ (6300663870), పత్తికొండ డివిజన్ వారు మద్దికెర ఆఫీసు సబార్డినేట్ వీరేష్ (81791 07795), ఆదోని డివిజన్ వారు ఎమ్మిగనూరు ఆర్ఐ జెర్మియా (6305089087)కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఏపీఏఈయూలో జిల్లా వాసులకు చోటు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంఘం కార్యవర్గంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఇద్దరికి ప్రాతినిధ్యం లభించింది. గురువారం వైఎస్సార్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘానికి అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు అయింది. కమిటీలో నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటు డీ.శ్రీహరి కోశాధికారిగా, కర్నూలు జిల్లా నుంచి కర్నూలు డివిజన్ భూసంరక్షణ విభాగంలో సీనియర్ అసిస్టెంటు రూపేష్‌కుమార్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

బీరప్ప ఆలయానికి విరాళం

కర్నూలు (అర్బన్): నగర శివారు పెద్దపాడు సమీపంలో నిర్మిస్తున్న బీర లింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మిగనూరు మండలం ఎర్రకోటకు చెందిన కురువ అంపయ్య రూ.50 వేలు విరాళంగా అందజేసినట్లు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.కె.రంగస్వామి తెలిపారు. ఆలయ నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు.

కదులుతున్న అవినీతి డొంక?

- టౌన్‌ప్లానింగ్ విభాగంలో భారీ అవినీతి
- ఎన్నికల వేళ.. అనుమతుల మంజూరులో అక్రమాలు
- ఓ అధికారిణి రూ.3 కోట్లతో ఏ.క్యాంపులో భవన నిర్మాణం
- భర్త వార్డు ప్లానింగ్ కార్యదర్శి, భార్య అదే విభాగంలో అధికారి
- భవనాలకు రూ.లక్ష, అపార్టుమెంట్‌కు రూ.10 లక్షలు వసూలు
- ప్రభుత్వానికి ఫిర్యాదుల వెల్లువ – మూడు రోజులుగా కొనసాగుతున్న విచారణ
- నేడు నివేదిక సమర్పించనున్న విచారణ కమిటీ

'కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో నివసించే ఈశ్వర్ అనే వ్యక్తి ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఎంతకూ ఫైల్ క్లియర్ కాలేదు. దీంతో ఏరియా పరిధిలోని 89వ సచివాలయంలో సంప్రదించాడు. సచివాలయ ఉద్యోగికి రూ.20 వేలు, సచివాలయ ఇన్‌చార్జ్‌కు రూ.6 వేలు లంచం ఇచ్చుకున్నాడు. వెంటనే ఫైల్ క్లియర్ అయ్యింది. ఈ తరహాలో టౌన్ ప్లానింగ్‌లో పెద్దఎత్తున అవినీతి జరిగింది.'



కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్‌లో అవినీతి డొంక కదులుతోంది. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కోడ్ అమల్లోకి రావడం. ఉన్నతాధికారులంతా ఎన్నికల పనుల్లో బిజీగా ఉండటంతో టౌన్‌ప్లానింగ్‌లో రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. టౌన్ ప్లానింగ్‌లో అధికారిగా ఉన్న ఓ మహిళ, ఆమె భర్త వార్డు ప్లానింగ్ కార్యదర్శి కావడంతో భవనాలు, అనధికారిక భవనాలు, అప్రూవల్స్ ఇలా.. ప్రతి పనికి పక్కాగా రేటు నిర్ణయించారు. అధికారిణి కావడంతో ఆమె చెప్పినట్లు పలువురు వార్డు ప్లానింగ్ కార్యదర్శులు సహకరిస్తూ అవినీతిలో భాగస్వాములయ్యారు. వినకుంటే వారికి మెమోలు ఇబ్బందులు సృష్టించేవారు. ఏ అధికారి ఎంత మేర అవినీతికి పాల్పడ్డారన్న వివరాలతో ఇప్పటికే ప్రభుత్వానికి వెల్లువలా ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక కార్యాలయంలో రెండు రోజులుగా అంతర్గతంగా విచారణ జరుగుతోంది.

అధికారం అడ్డం పెట్టుకొని..

నగరపాలక సంస్థలో పనిచేసే వార్డు ప్లానింగ్ కార్యదర్శి అనేక అక్రమాలు చేశారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన భార్య టౌన్‌ప్లానింగ్‌లో ద్వితీయ శ్రేణి అధికారిణిగా పనిచేస్తోంది. ఇంకేముంది.. వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా కొన్ని నెలలు నడిచింది. ఈయన ఏకంగా ఎస్వీ కాంప్లెక్స్ వద్ద ఓ దుకాణం ఏర్పాటు చేసి అక్రమాలకు అడ్డాగా మార్చారు. అర్బన్ డిజైనర్స్ పేరుతో కాంప్లెక్స్‌లో షాపు తెరిచారు. ఇక్కడ లేఔట్ డిజైన్స్, అప్రూవల్స్, బిల్డింగ్ పర్మిషన్స్, బిల్డింగ్ డిజైన్స్, ఎలివేషన్ బిల్డింగ్స్, ల్యాండ్ స్కేపింగ్, గార్డెన్ డిజైనింగ్ వంటి పనులు చేస్తున్నారు. ఇదే ముసుగులో నగరపాలక సంస్థకు వచ్చే ప్రతి అప్రూవల్ ఇక్కడే క్లియర్ కావాలి. ఇక్కడే పెద్ద ఎత్తున వ్యాపారం చేశారు. అనుమతులు లేకుండా, అనధికారికంగా అనుమతులు ఇవ్వడం, అదనపు ఫ్లోర్లు నిర్మించుకోవడం, అప్రూవల్‌కు వచ్చే వారి నుంచి నిబంధనల పేరుతో రూ.లక్షలు వసూలు చేశారు. భవనాలకు క్లియరెన్స్ చేయాలంటే రూ.లక్ష, అపార్టుమెంట్‌లో పార్కింగ్ లేకుండా సెట్ బ్యాక్స్ లేకుండా, అదనపు ఫ్లోర్లు వేసుకునేందుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల ప్రకారం వసూలు చేశారు. ఇదంతా సదరు టౌన్ ప్లానింగ్ అధికారిణి నుంచే జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే ఆ అధికారిణి ఏ.క్యాంపులో రూ.3 కోట్లు వెచ్చించి భవనాన్ని నిర్మించినట్లు ప్రభుత్వానికి లిఖిత పూర్వంకగా ఫిర్యాదులు అందాయి. ద్వితీయ శ్రేణి అధికారిణి తన భర్తతో అనుమతుల విషయంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి వ్యక్తిగతంగా వసూళ్లకు పాల్పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. అదే స్థాయిలో ఇదే విభాగంలో తృతీయ శ్రేణి అధికారిగా పనిచేసే ఒకరు తన కుమారుడిచే మౌర్య ఇన్ సమీపంలో ఓ దుకాణం తెరిపించారు. ద్వితీయ శ్రేణి అధికారికి తానేం తక్కువ కాదంటూ ఈయన పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డారు.

అక్రమాల్లో వార్డు ప్లానింగ్ కార్యదర్శుల భాగస్వామ్యం

టౌన్ ప్లానింగ్ అధికారికి కొంత మంది వార్డు ప్లానింగ్ కార్యదర్శులు వంత పాడారు. రూ.లక్షలు వసూళ్లు చేశారు. ఇందులో బుధవారపేట 33వ సచివాలయం, డాక్టర్స్ కాలనీలోని 54వ సచివాలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని 55వ సచివాలయం ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. మరో సచివాలయ ఉద్యోగి ఏకంగా ప్రైవేటు ఉద్యోగిని నియమించుకొని డి మార్టు వద్ద ఓ దుకాణం ఏర్పాటు చేశారు. రూ.లక్షలు వసూలు చేశారు. అందులో అధికారులకు వాటాలు ఇచ్చారు.

నేడు ప్రభుత్వానికి నివేదిక

ఈనెల 15వ తేదీ నాటికి కర్నూలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అక్రమాలపై విచారణ నివేదిక సమర్పించనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ అవినీతి బాగోతంలో ద్వితీయ శ్రేణి అధికారిణి, తృతీయ శ్రేణి అధికారిణి, ఇటీవల బదిలీపై డోన్, అనంతపురం కార్పొరేషన్లకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, పలువురు ప్లానింగ్ కార్యదర్శులు ఉన్నారు. వీరిపై శాఖా పరంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

నగరపాలకలో రెండు రోజులుగా విచారణ

టౌన్ ప్లానింగ్ విభాగంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో స్పందించిన ప్రభుత్వం విచారణ జరిపేందుకు అధికారులను నియమించింది. ఇందులో పి.నరసింహప్రసాద్ (చిత్తూరు మున్సిపల్ కమిషనర్), వి.దివాకర్‌రెడ్డి (రాయదుర్గం కమిషనర్), మహాపాత్రో (తిరుపతి డిప్యూటీ సిటీ ప్లానర్), నజీర్ హుస్సేన్ (ఆదోని రెవెన్యూ ఆఫీసర్), ఓంకార్ (అనంతపురం టౌన్ ప్లానింగ్ ఆఫీసర్) ఉన్నారు. వీరంతా నగరపాలక కార్యాలయంలో రెండు రోజులుగా విచారణ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ప్రైవేటు ప్లానర్స్‌తో మాట్లాడారు. అలాగే అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, ప్లాన్ అప్రూవల్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను ఈ అధికారుల బృందం పరిశీలించనుంది.

క్రీడలతో మానసికోల్లాసం

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని రాయలసీమ విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ సూచించారు. ఫ్రెషర్స్‌డే వేడుకలను పురస్కరించుకొని గురువారం వర్సిటీలో పీజీ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. చదువు, క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి తన దినచర్యలో క్రీడలను భాగం చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు సూచించారు. వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్.నరసింహులు, ఫిజికల్ డైరెక్టర్ శివకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను చేజార్చుకోవద్దు

విద్యార్థులు అవకాశాలను చేజార్చుకోవద్దని ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్ సూచించారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఏర్పాటు చేసిన బీటెక్ విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో వీసీ, రిజిస్ట్రార్‌తో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. కళాశాలలో మరో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని, వైఫై సౌకర్యం కల్పించాలని, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

వార్డుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్ బీవై రామయ్య, కమిషనర్ రవీంద్రబాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి వార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. స్థానిక నగరపాలక సంస్థలోని ఆయన చాంబర్‌లో గురువారం మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పది అంశాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.3.81 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్టాండింగ్ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సమావేశంలో నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, క్రాంతికుమార్, జుబేర్, యూనూస్, అదనపు కమిసనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునీద్, పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు ఇవే..

- 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో మురుగు కాల్వల నిర్మాణానికి రూ.48 లక్షలు కేటాయించారు.
- 31వ వార్డులో సీసీ డ్రైన్, కల్వర్టుల నిర్మాణానికి రూ.34 లక్షలు
- 23వ వార్డు శ్రీరామనగర్‌లో రూ.49.90 లక్షలతో సీసీ కాల్వల నిర్మాణం
- 24వ వార్డు లక్ష్మీనగర్, మద్దూర్ నగర్‌లో రూ.49.90 లక్షలతో సీసీ కాల్వలు
- బుధవారపేటలోని 14, 15 వార్డుల్లో రూ.45 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం
- 30వ వార్డు శరీన్‌నగర్‌లో రూ.49.95 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణం
- 2వ వార్డు గడియారం ఆసుపత్రి, ఆలిషేక్‌బాగ్, ప్రాంతాల్లో రూ.35 లక్షలతో మురుగు కాల్వలు, కల్వర్టుల నిర్మాణం
- 27వ వార్డు ఆదిత్య నగర్‌లో రూ.26 లక్షలతో సీసీ డ్రైన్లు నిర్మాణం
- క్లాప్ డ్రైవర్లకు నాలుగు నెలల వేతన బకాయిలు రూ.43.68 లక్షలు మంజూరు
- గుత్తి పెట్రోల్ బంకు వద్ద వాహనాల పార్కింగ్ స్థలానికి నిర్వహించిన బహిరంగ వేలానికి ఆమోదం వ్యక్తం చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం



నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పి.బి.వి.సుబ్బయ్య.



శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ జయప్రకాష్



బాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శన



డ్యాన్స్ చేస్తున్న బాలలు

కర్నూలు సిటీ: దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం నగరంలోని పలు విద్యా సంస్థల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, కరెస్పాండెంట్లు, టీచర్లు పాల్గొని నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

- మాంటిస్సోరి ఒలింపస్‌లో నిర్వహించిన వేడుకల్లో డైరెక్టర్ కె.ఎస్.వి రవిప్రకాష్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ పాల్గొన్నారు. చిన్నారుల ఏకపాత్రాభినయం, స్కిట్స్, పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.
- అబ్బాస్‌నగర్ రవీంద్ర స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్, రవీంద్ర బాలికల స్కూల్ విభాగంలో అకడమిక్ అడ్వైజర్ జి.మమతామోహన్, రవీంద్ర జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, వైస్ చైర్మెన్ జి.వంశీధర్ పాల్గొన్నారు.
- మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.
- కేవీఆర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలిచిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.
- మాధవీనగర్‌లోని రవీంద్ర ఇంగ్లిషు మీడియం స్కూల్, రెవెన్యూ కాలనీ రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఆ స్కూళ్ల కరస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య, లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.
- ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ రమాజ్యోతి పాల్గొన్నారు. చిన్నారుల నృత్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి.

యువతతోనే దేశ భవిష్యత్తు

కర్నూలు(హాస్పిటల్): దేశ భవిష్యత్తు యువతపైనే ఉందని అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ (ఏఏసీఐ) చైర్మన్ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి ట్రస్ట్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సందీప్‌క్లినిక్, ఏఏసీఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ కాలనీలోని మేఘన పాఠశాల ఆవరణలో చిన్నారులకు, యువతకు, అనాథలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు జయప్రకాష్, రంగనాయకులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్) : బాలల నేస్తం.. చిన్నారుల ప్రీతి పాత్రుడు.. నవ భారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, పార్లమెంట్ సమన్వయకర్త పీజీ రాంపుల్లయ్య యాదవ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీబాషు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారపేట అనాథాశ్రమం, గ్లోబల్ స్కూలులో బాలల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

జీవనశైలి మార్పుతోనే డయాబెటీస్ నియంత్రణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): శారీరక శ్రమ, జీవనశైలిలో మార్పులతోనే డయాబెటీస్ వ్యాధిని నియంత్రించుకోవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. గురువారం ప్రపంచ డయాబెటీస్ డే సందర్భంగా మెడికల్ కాలేజీలోని ఎండ్రోక్రైనాలజీ విభాగం ఆధ్వర్యంలో హెచ్ఓడీ డాక్టర్ పి.శ్రీనివాసులు అధ్యక్షతన నర్సులకు వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో ఒత్తిడి పెరిగిపోయిందని, శారీరక శ్రమ తగ్గిందని, ఆహారపు అలవాట్లు కూడా మారిపోయాయని దీని వల్లే దీర్ఘకాలిక వ్యాధులు పెరిగిపోతున్నాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డయాబెటీస్ రోగుల సంరక్షణలో నర్సింగ్ సేవలు కూడా ముఖ్యమన్నారు. రోగులకు డయాబెటీస్ కేర్ గురించి వివరించాలని సూచించారు. డాక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ డయాబెటీస్‌కు ప్రతిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని, రోగులు క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 సావిత్రిబాయి, బీఎస్సీ, జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని మెడికవర్, జెమ్‌కేర్ కామినేని ఆస్పత్రుల్లో డయాబెటీస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్తీక దీపం.. పుణ్య ఫలం

- నేడు కార్తీక పౌర్ణమి
- శివాలయాల్లో ప్రభవించనున్న కార్తీక శోభ
- వినాయక ఘాట్‌లో లక్ష దీపోత్సవం



వినాయక ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్తీక దీపోత్సవ సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసంలో పౌర్ణమి అత్యంత పవిత్రమైనది. ఆ రోజున పిండితో ప్రమిదలు చేసి 365 ఒత్తులతో, నెయ్యితో దీపారాధన చేస్తే అనంత పుణ్య ఫలం లభిస్తుంది. ఈ రోజు ఏ పని చేసినా సఫలీకృతం అవుతుంది. అందుకే మహా కార్తీక అంటారు. గురువారం జిల్లావ్యాప్తంగా కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించనున్నారు.

జ్వాలా తోరణం శివునికి ప్రీతికరం

జ్వాలా తోరణం శివునికి ప్రీతి. దీని దర్శనం సర్వపాప హరణం. సముద్ర మధనంలో విషం వస్తే మొదట స్వీకరించి తన గరళంలో ఉంచుకున్నాడు పరమేశ్వరుడు. అమ్మవారు స్వామి కుక్షిలోనికి పోకుండా ఆపింది. అందుకే శివున్ని గరళ కంఠుడు అంటారు. ఆ సయమంలో అమ్మవారు జ్వాలా తోరణం చేస్తానని మొక్కుకుందట. ఆ జ్వాలా తోరణంలో శివుడు అమ్మవారు ఉంటారు. అందుకే జ్వాలాతోరణం వెలిగించినప్పుడు భక్తులు దర్శించుకుని దాని కింద వెళతారు. స్వామివారిని పల్లకీలో ఊరేగించి తిప్పుతారు. ఆ భస్మాన్ని పెట్టుకుంటే సర్వ అరిష్టాలు పోతాయని అంటారు. దీన్నే త్రిపుర దహనం అని కూడా అంటారు.

దీపదానం సత్ఫలితం..

మన హృదయమే దేవాలయంగా భావించి స్వామిని దీపంతో అర్చిస్తారు. శరీరం శుచిగా ఉండేందుకు స్నానం, మనస్సు శుచిగా ఉండేందుకు దానం అవసరం. దీపదానం వల్ల సత్ఫలిస్తాడు పరమేశ్వరుడు. జ్ఞానం పెరుగుతుంది. కార్తీక పౌర్ణమి రోజున దీపాలు నదులలో వదులుతారు. వీటివల్ల ఆ నదులలోని జలచరాలు కూడా ధన్యులు అవుతాయి. మన పాపాలు తొలగుతాయి. పితృదేవతలు తరిస్తారు. సర్వ ప్రాణులు ధన్యులు అవుతాయి.

జిల్లావ్యాప్తంగా కార్తీక శోభ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం, మహానంది, ఓంకారం, సంగమేశ్వరం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం, కాల్వబుగ్గతో పాటు కర్నూలు నగరంలోని సప్తగిరి కైలాసగిరి ఆలయం, నగరేశ్వర స్వామి ఆలయం, లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి ఆలయం, అశోక్‌నగర్, శ్రీరామ నగర్, కొత్తపేట లోని శివరామాలయల్లో కార్తీక పౌర్ణమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

ముక్కోటి దేవతారాధనతో సమానం



కార్తీక పౌర్ణమి రోజున దీపారాధన చేస్తే ముక్కోటి దేవతలను పూజించిన ఫలం సిద్ధిస్తుంది. 'దీపదో లభతే విద్యాం దీపదో లభతే శ్రుతం దీపదో లభతే చాయుః దీపదో లభతే దీపమ్' అంటే దీపం వెలిగించిన వారు విద్యావంతులు, జ్ఞానవంతులు, ఆయుష్మంతులవుతారు. మోక్షాన్ని పొందుతారు. సాయం సంధ్యవేళలో శైవాలయాల్లో దీపం వెలిగిస్తే అనంత పుణ్యం లభిస్తుంది. సర్వ శుభాలు కలుగుతాయి. నదులు, చెరువులు, కాలువలు అందుబాటులో లేకుంటే శివాలయాల్లో దీపారాధన చేయడం మంచిది. ఉపవాసం ఉండి పూజించాలి. ముఖ్యంగా దీపదానం, దీపారాధన, దైవ దర్శనం చేయాలి.

– మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, పండితుడు

నేడు కార్తీక లక్ష దీపోత్సవం

కర్నూలు కల్చరల్: కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు నగరంలోని వినాయక ఘాట్‌లో కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి ఘాట్‌లోని ప్రధాన వైదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, 5 గంటలకు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి నుంచి ఘాట్ వరకు రథంపై శివపార్వతుల ఊరేగింపు, 5.30 గంటలకు జ్యోతి ప్రజ్వలన, 6 గంటలకు ఆకాశదీప ప్రజ్వలనం, 6.30 గంటలకు శివ పార్వతుల అభిషేకం, కల్యాణం, శివ పార్వతుల కల్యాణ విశిష్టతపై చిన్మయ విషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానందచే ప్రవచనం, 7.30 గంటలకు నాగఫణిశాస్త్రి బృందంచే తుంగా (గంగా) హారతి, జ్వాలా తోరణం, జ్యోతులను గంగలో సామూహికంగా వదలడం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. కార్తీక దీపోత్సవ సమితి కార్యాధ్యక్షులు పద్మావతి, సభ్యులు గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొననున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని మహిళలు జాగ్రత్తగా దీపాలను వదలాలని సూచించారు. గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారన్నారు. పిల్లలను వెంట తీసుకురాకపోవడం మంచిదన్నారు. కల్కి సేవా సమితి వారు ఉచిత దీపదానం చేయనున్నట్లు తెలిపారు.

క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తనిఖీ



డీసీఆర్‌బీని తనిఖీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): జిల్లా పోలీసు కార్యాలయంలోని డీసీఆర్‌బీ (క్రైమ్ రికార్డు బ్యూరో)ను గురువారం ఎస్పీ బిందుమాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల రిజిస్టర్లు, పలు రికార్డులు పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు డీసీఆర్‌బీ కీలకమన్నారు. ఎప్పటికప్పుడు వివరాలు అప్‌డేట్ చేయాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ బాబు, కోర్టు మానిటరింగ్ ఇన్‌చార్జ్ సీఐ రామయ్య నాయుడు ఉన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



మణికంఠ అయ్యప్ప స్వామి



కలశ పూజలో అయ్యప్ప భక్తులు

కర్నూలు కల్చరల్: కర్నూలు మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయం 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం సప్తగిరి నగర్‌లోని అయ్యప్ప ఆలయంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచి మహాగణపతి హోమం, నవాభిషేకం, లక్ష బిల్వార్చన, మహాకుంబాభిషేకం, పడి పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేయర్ బీవై రామయ్య పూజల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భార్గవకుమార్ శిష్య బృందంచే సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, జయశేఖర్, శేషయాదవ్‌గురుస్వాముల శిష్యబృందంచే నిర్వహించిన అయ్యప్ప భజనలు ప్రత్యేకంగా నిలిచాయి. కర్నూలు జిల్లా తొగట వీర క్షత్రియ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో దేవనగర్ సత్య నారాయణ స్వామి ఆలయం నుంచి సప్తగిరి మణికంఠ అయ్యప్ప దేవాలయంలోని శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయ సన్నిధి వరకు నిర్వహించిన జ్యోతి ఉత్సవం వైభవంగా సాగింది. భక్తులకు అన్నప్రసాదం, అల్పాహార ప్రసాదం వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనిచేసినా పస్తులే!

కర్నూలు సిటీ: పూడూరు జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు వేతనాలు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తుండగా.. తనకు గౌరవం ఇవ్వకపోవడంతోపాటు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తున్నారనేది హెచ్ఎం వాదన. పూడూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శేష ఫణి రాజు, తెలుగు టీచర్ జి.నాగేంద్రుడు, బయోలాజికల్ సైన్స్ టీచర్ డి.బాకర్ సాహెబ్‌తో కలిపి మొత్తం 8 మంది విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా హెచ్ఎంకు ఉపాధ్యాయులు నాగేంద్రుడు, బాకర్‌సాహెబ్‌కు సరిపోవడం లేదు. దీంతో హెచ్ఎం ఆగస్టు నెల జీతం చేయకపోవడంతో టీచర్లు డీఈఓ దృష్టికి తీసుకెళ్లి కాస్త ఆలస్యంగా జీతాలు చేయించుకున్నారు. సెప్టెంబరు, అక్టోబరు జీతాలు కూడా చేయకపోవడంతో ఆగస్టులో జి.నాగేంద్రుడు, హిందీ టీచర్ సురేంద్ర ఇంక్రిమెంట్స్ నిలిచిపోయాయి.సమస్యపై అప్పటి డీఈఓ తాత్సారం చేయడంతో బాధితులు రెండుసార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆదోని డిప్యూటీ ఈఓ, ఓ ఎంఈఓలను విచారణ అధికారులుగా నియమించినా విచారణ మాత్రం జరగలేదు. ఇటీవల జీతాలు చేయాలని అధికారుల నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో గురువారం ఏకంగా టీచర్లను డీఈఓకు హెచ్ఎం సరెండర్ చేశారు.